ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 22 మార్చి 2024



గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రాయికల్, మార్చి 21: మండలంలోని అల్లీపూర్, శ్రీ రాంనగర్ గ్రామాల్లో గురువారం 220 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు అదనపు పశు వైద్యాధికారి నరేష్ తెలిపారు. లేగ దూడల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పెయ్య దూడలను సరిగా పెంచితే అవి పాడి గేదెలుగా ఎదిగి, పాడి పశువును కొనే అవసరం లేకుండా ఆర్థికంగా రైతులకు తోడ్పతాయన్నారు.

అంగరంగ వైభవంగా నృసింహుడి కల్యాణం

● తిలకించిన వేలాది మంది భక్తులు ● పాల్గొన్న మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ అడ్లూరి



ధర్మపురి, మార్చి 21: ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణోత్సవం గురువారం సాయంత్రం గోధూళి సుముహూర్తాన అత్యంత వైభవంగా జరిగింది. క్షేత్ర నలుమూల నుంచి భారీగా తరలి వచ్చిన వేలాది మంది భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవం పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవ మూర్తులను సాయంత్రం వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ఆలయాల నుంచి బయటకు తీసుకవచ్చారు.

సనాతన సాంప్రదాయ రీతిలో అర్చకులు ఉత్సవమూర్తులను శేషప్ప కళా వేదిక పైన ఆశీనులు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు ఇంటి వద్ద నుంచి శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారలకు ఎదురుకోలు ఉత్సవా లు నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ శర్మ, కల్యాణం నిర్వహించా రు. అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారల కల్యాణోత్సవం జరిపించారు. వేలాది మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని కట్న కానుకలు, అమ్మవారలకు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పురాణ ప్రవచకులు బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, పలువురు పండితులు ఉత్సవ తీరు గురించి ప్రత్యక్ష వ్యాఖ్యానం చేశారు.

అంతకు ముందు రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామి కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఉదయ్‌కుమార్, సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డీసీఎం ఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ధర్మపురి, బుగ్గారం జడ్పీటీసీలు అరుణ, రాజేందర్, రాజమణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ రామయ్య పాల్గొన్నారు. స్వామివారల కళ్యాణోత్సవం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగం గా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ ధర్మశాల ఆవరణలో ఏర్పా టు చేసిన నిత్య అన్నదానం కార్యక్రమాన్ని గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఈవో శ్రీనివాస్, కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అన్నదానం ఒక మంచి కార్యక్రమమన్నారు. అనంతరం భక్తులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా అన్నదానం కోసం రూ 10,016 విరాళాలు అందించారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్ సిబ్బంది సేవలు అందించారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, పట్టణ ఆర్యవైశ్య వర్తక సం ఘాల అధ్యక్షులు మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, కోశాధికారులు రంగ శంకరయ్య, సత్రం కోశాధికారి దేవేందర్, రైస్‌మిల్ యజమానులు వినోద్‌రావు, రవీందర్ పాల్గొన్నారు.

భక్తుల కోసం చలి వేంద్రాలు ఏర్పాటు

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థ వివిధ శాఖల పక్షాన సేవలు అందిస్తున్నారు. మున్సిపల్ పక్షాన పదకొండు చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు. క్షేత్రంలోని అన్ని వీధుల్లో మున్సిపాలిటీ సంబంధించి న 35 మందితో పాటు అదనంగా మొత్తం 140 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికులచే పనులు చేయిస్తున్నారు. ధర్మపురి దేవాలయం, గోదావరి నది వద్ద కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి సేవలు అందిస్తు న్నారు. గోదావరి నది వద్ద ప్రమాదాలు జరుగనీయకుండా గత ఈత గాళ్లను నియమించారు. కలెక్టర్ ఆదేశానుసారంగా ప్రత్యేక దృష్టి సారిం చి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ గంగాధర్, శాని టరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, ఈఈ మహేష్, సిబ్బంది చర్యలు చేపట్టారు.

●ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల కోసం వివిధ బస్ డిపోల నుంచి సుమారు 100 ట్రిప్పుల బస్సులు నడిపించారు. వీటిలో జగిత్యాల, ఆర్మూర్, నిర్మల్, కరీంనగర్, నిజామాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కోరుట్ల నుంచి బస్సులు నడిపించారు.

●ధర్మపురి క్షేత్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీహెచ్‌సీ, దేవాలయం, గోదావరి నది, బస్ స్టేషన్, ఓరియంటల్ కళాశాల వద్ద ఐదు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జగిత్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఉత్సవాలు పూర్తి అయ్యే వరకు షిఫ్టు పద్ధతిలో జిల్లాకు చెందిన పీహెచ్‌సీల నుంచి వైద్యులకు విధులు అప్పగించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 22 న రాత్రి 7 గంటలకు క్షేత్రంలోని పలు వీధుల గుండా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారల ఊరేగింపు సేవ ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శేషప్ప కళా వేదికపై రాత్రి స్థానిక కళాకారులచే భక్తి సంగీత విభావరి ఉంటుందని ఈవో తెలిపారు. రాత్రి 7-30 గంటలకు భక్తి సంగీత విభావరి, 8-30కు కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని ఆయన అన్నారు. 9-30 నుంచి భక్తి సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


అన్నదానం సందర్భంగా భక్తులకు వడ్డిస్తున్న ప్రభుత్వ విప్, చైర్మన్

కాంగ్రెస్ పెద్దపల్లి అభ్యర్థిగా వంశీకృష్ణ

- మాజీ ఎంపీ వివేక్ వారసుడిగా ఎన్నికల బరిలోకి..
- అధికారికంగా ప్రకటించిన ఏఐసీసీ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)


గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ పేరును ఖరారు చేస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గంలోని ఏడు నియోజకవర్గాల్లో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడంతో టికెట్ వస్తే గెలవడం సునాయాసమేనని భావించిన అనేకమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపల్లి టికెట్ ఆశించారు. టీపీసీసీకి 29 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. పెద్దపల్లి టికెట్ కోసం మాల సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ దరఖాస్తు చేసుకున్నారు. అలాగే మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిలో మాజీ ఎంపీ డాక్టర్ పి సుగుణ కుమారి, ఊట్ల వరప్రసాద్, ఆసంపల్లి శ్రీనివాస్, గజ్జెల కాంతం, పెర్క శ్యాం, నేతకాని సామాజిక వర్గం నుంచి గోమాసే శ్రీనివాస్, దరఖాస్తు చేసుకున్నారు. సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి టికెట్ రేస్‌లో నిలిచారు. ఏఐసీసీకి టీపీసీసీ నుంచి గడ్డం వంశీకృష్ణతో పాటు మాజీ ఎంపీ డాక్టర్ సి సుగుణ కుమారి, సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేత, ఊట్ల వరప్రసాద్, అసంపల్లి శ్రీనివాస్ తదితరుల పేర్లు పంపించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం సమావేశమై పెద్దపల్లి అభ్యర్థి ఎంపిక విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. గడ్డం వంశీ కృష్ణ పేరును ఖరారు చేశారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు ఎస్పీ



ఎస్పీకి పూల మొక్కను అందజేస్తున్న అదనపు ఎస్పీవినోద్ కుమార్
జిల్లా న్యాయమూర్తి నీలిమను కలిసిన ఏఎస్పీ

జగిత్యాల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు ఎస్పీగా వినోద్ కుమార్‌ను నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వినోద్ కుమార్ గురువారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

జిల్లా జడ్జిని కలిసిన ఏఎస్పీ

జిల్లా ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ ఇటీవల నియామితులయ్యారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు.

బోనాల మహోత్సవంలో పాల్గొన్న విప్


పెద్దనక్కలపేట గ్రామంలో బోనాల కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 21: ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఆయన అమ్మవారిని దరించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి బోనాల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న తన దృష్టికి తీసుక రావాలని ఆయన తెలిపారు. అంతకు ముందు ఆలయం పక్షాన ఆయనకు స్వాగతం పలికి శాలువా కప్పి స్వాగతం పలికారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగ నభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్

జగిత్యాల అర్బన్, మార్చి 21 : పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన విద్యార్థులు మారుతి, రహ్మతుల్లా, విఘ్నేష్, నిక్షిత్, సాత్విక్‌లు ఈనెల 13న భీమారం మండలంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ లెవల్ సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ నెల 22,23,24 తేదీల్లో నల్గొండ జిల్లా ఆలేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు, తమ పాఠశాలలో చదివే విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, ఇది పాఠశాలకే గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు, పాఠశాల డైరెక్టర్‌లు, ఉపాధ్యాయులున్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

జగిత్యాల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాలు లో గురువారం స్త్రీల వైద్య నిపుణులతో జిల్లా వైద్యాధికారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాధారణ ప్రసవాలు పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అత్యధిక సాధారణ ప్రసవాలు చేసిన వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు సమియోద్దీన్, శ్రీనివాస్, జైపాల్ రెడ్డి ఉన్నారు.

మహిళా ఓట్లే కీలకం

●నిజామాబాద్ పార్లమెంట్‌లో అతివలదే ఆధిక్యం
●నియోజకవర్గం పరిధిలో 16,72,118 మంది ఓటర్లు

జగిత్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలే కీలకంగా మారారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో అతివలదే ఆధిక్యత చోటుచేసుకుంది. దీంతో ఎన్నికల్లో మహిళలను ప్రసన్నం చేసుకోవడానికి రాజకీయ పక్షాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 16,72,118 మంది మొత్తం ఓటర్లుండగా పురుషులు 7,94,819 మంది, మహిళలు 8,77,225 మంది, ఇతరులు 74 మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 82,406 మంది అధికంగా ఉన్నారు.

వీరికి హోమ్ బ్యాలెట్..

85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు కేంద్ర ఎన్నికల కమిషన్ హోమ్ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించింది. వీరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ఇంటి దగ్గరి నుంచే ఓటు వేసేలా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు. ఈ ఓటర్లలో పోస్టల్ బ్యాలెట్ కావాలనుకునే వారు ఫారం- 12 డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులు గ్రామాలు, పట్టణాల్లో బూత్ లెవల్ అధికారుల వద్ద, తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా అందు బాటులో ఉంటాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏళ్ల ఉన్న వృద్ధులకే పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండగా, దీన్ని ఎన్నికల సంఘం 85 ఏళ్లకు పెంచింది. జిల్లాలో 85 ఏళ్ల పైబడిన వృద్ధ ఓటర్లు, దివ్యాంగ ఓటర్లను అధికారుగు గుర్తించారు.



ఇంకా ఓట హక్కు నమోదుకు అవకాశం..

18 ఏళ్ల నిండిన వారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం జనవరి 1వ తేదీ, ఏప్రిల్ 1వ తేదీ, జూలై 1వ తేదీ, అక్టోబర్ 1 వ తేదీని కటాఫ్ తేదీలుగా నిర్ణయించింది. ఈ తేదీల నాటికి 18 ఏళ్ల నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్ల నిండితే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. వచ్చే నెల 15 వరకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

బాధితులకు మద్దతు తెలిపిన దళిత సంఘాలు

మెట్‌పల్లి, మార్చి, 21 : మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గొర్రె మల్లేశం, గొర్రె రంజిత్‌లపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్‌లోని దళిత బహుజన సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన అగ్రకుల అహంకారంతో దళితులపై దాడి చేసి బయట తిరుగుతున్న వారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే దళిత బహుజన సంఘాల తరుపున వేలాది మంది నిరసన కార్యక్రమాలను చేపడు తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తి అభినందనీయం

ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్

జగిత్యాల అర్బన్, మార్చి 21 : వినియోగదారులకు సేవలందించడంతో పాటు, సామాజిక స్ఫూర్తితో బ్యాంకులు ముందుకు వెళ్లడం అభినందనీయం అని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎస్‌బీఐ అశోక్‌నగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 70 రకాల మొక్కలను కళాశాలకు అందజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడుతూ భావితరాలకు నీడను, ప్రాణవాయువును అందించేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలను నాటుతూ, వాటిని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, హరితహారం కోఆర్డినేటర్ రాధాక్రిష్ణ తో పాటు కళాశాల సిబ్బంది, ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువ నీటిని పొదుపుగా వాడాలి

జగిత్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం తక్కువగా ఉన్నందున, మిగిలిన నీటిని తాగునీటి కోసం మాత్రమే వినియోగించాల్సి ఉన్నందున ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని ఎస్సారెస్పీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. కాకతీయ ప్రధాన కాలువ ద్వారా జోన్-1(డీ5 నుంచి డీ 53) ఆయకట్టుకు ఈనెల 25వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నీరు సరఫరా చేయబడుతుందని తెలిపారు. ఆయకట్టుకు ప్రస్తుత యాసంగికి ఇదే చివరి తడి అవుతుందన్నారు. నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని ప్రకటనలో కోరారు.

ఉపాధి కూలీలకు అందని డబ్బులు

● రెండు నెలలుగా ఎదురుచూపులు ● పనులకు వచ్చేందుకు విముఖత ● లక్ష్యం చేరక సిబ్బంది ఇబ్బందులు


పనులు చేస్తున్న కూలీలు

కథలాపూర్, మార్చి 21 : అసలే సిబ్బంది కొరత..అపై పనులకు వచ్చేదుకు కూలీలు విముఖత ప్రదర్శిస్తున్న కారణంగా ఉపాధి పనుల లక్ష్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గడిచిన రెండు మాసాలుగా కూలీలకు వేతనాలు అందకపోవడం వల్ల రోజురోజుకూ కూలీల హాజరు శాతం తగ్గిపోతోంది. వేసవిలో పంటపొలాల పనులకు తగ్గిపోయి ఉపాధి హామి పనులకు కూలీలు అధిక సంఖ్యలో వెళ్తుంటారు. అయితే కూలీ డబ్బులు సకాలంలో ప్రభుత్వం చెల్లించకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

● కూలీల హాజరులో జిల్లాలో 7వ స్థానం

మండలంలో 19 గ్రామాల్లో 8329 మంది ఆక్టివ్ లేబర్లు ఉన్నారు. వాస్తవానికి ప్రతీ గ్రామం నుంచి వంద మంది చొప్పున రోజుకు సగటున పనులకు హాజరు కావాల్సి ఉంది. 800 మంది కూడా పనులకు హాజరు కావడం లేదు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ అమలు చేస్తున్న నేపథ్యంలో నేరుగా కూలీల ఖాతాల్లోకి డబ్బులు జమ కాబడుతున్నాయి. వాస్తవానికి చట్టం ప్రకారం 15 రోజుల్లోపు కూలీలకు డబ్బులు చెల్లించాల్సి ఉండగా అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం మండలంలో ఫీల్డ్ చానళ్ళు, ఫీడర్ చానళ్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, కాంటూరు కందకాలు, ఫిష్ ప్లాంట్లు వంటి పనులు కొనసాగుతున్నాయి. కూలీ డబ్బులు రాకపోవడంతో కొందరు పస్తులుండే పరిస్థితి దాపురించింది.

● సిబ్బంది కొరతతో పనులకు ఆటంకం

19 గ్రామాల్లో కేవలం 11 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తుండగా ముగ్గురికిగాను ఇద్దరు మాత్రమే టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు. కీలకమైన ఈసీ మెట్‌పల్లి నుంచి ఇక్కడ కొన్నేళ్ళుగా డిప్యూటేషన్‌పై పనిచేస్తు న్నారు. ఈ క్రమంలో ఉపాధి హామీ పనులకు ఆటంకం ఏర్పడుతోంది. కాగా ప్రభుత్వం కార్యాలయ నిర్వాహణకు సైతం డబ్బులు విడుదల చేయడం లేదని తెలుస్తోంది.

వరి పంటకు బోనస్ ప్రకటించాలి

హుజూరాబాద్‌రూరల్: వరి పంటకు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే రూ.500ల బోనస్ ప్రకటించాలని రాష్ట్ర కర్షక రైతు అభివృద్ధి సమితి నాయకులు కోరారు. గురువారం మండలంలోని రాంపూర్‌లో వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్‌కు రూ.2,203, బి గ్రేడ్‌కు రూ.2183 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి, సాదులా అంశరెడ్డి, చల్లూరి సారయ్య, జక్కోజు ఆంజనే యులు, చల్లూరి ఆగయ్య, రూపిరెడ్డి మల్లారెడ్డి, గంగుల శ్రీనివాస్, రాజు, ఎర్ర రవీందర్ తదితరులు ఉన్నారు.

ఎండిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట గ్రామంలో నీళ్లు లేక ఎండిపోయిన పంటలను మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పంటనష్టం జరిగిన ప్రతి ఒక్క రైతుకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పంట నష్టం కింద రూ.10వేలు అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండాల్‌రెడ్డి, రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

10లీటర్ల మద్యం పట్టివేత

సైదాపూర్, మార్చి 21: సైదాపూర్ మండల శివారులో ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 10.980లీటర్ల మద్యం పట్టుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేసినట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మనపల్లి గ్రామానికి చెందిన రాజయ్య అనే వ్యక్తి కాటన్ డబ్బాలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ. 9,900లు ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్టు షాపులు నిర్వహించిన, డీజేలు నడిపిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్న గ్రామస్థులు

మానకొండూర్, మార్చి 21: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో గురువారం గ్రామస్థులు ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్నారు. మానేరు వాగు నుంచి ప్రతినిత్యం అక్రమంగా ఇసుక తరలించడం వల్ల దుమ్ము, ధూళితో పాటు అతివేగంగా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకొని అక్రమ ఇసుకను అరికట్టాలని కోరుతున్నారు. రెండు గంటల పాటు ట్రాక్టర్‌లను ఆపారు.

మానకొండూర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మానకొండూర్, మార్చి 21 : మానకొండూర్ పంచాయతీ కార్యదర్శి వి. శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి నర్సయ్య తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తికి అక్రమంగా ఇంటి నెంబరు కేటాయించారు. దీంతో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి పంచాయతీ కార్యదర్శిని రెండు రోజుల క్రితం సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

రూ.7,750 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,750 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 63మంది రైతులు 843క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,750, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుల అరెస్ట్

ముస్తాబాద్, మార్చి 21: ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో బెల్ట్‌షాపుల నిర్వహిస్తున్న ఈడుగురాళ్ల రాజేశంగౌడ్ వద్ద 18,450 రూపాయలు, కొమిరె ఎల్లం వద్ద 9,060 రూపాయలు, ఈడుగురాళ్ల రామచంద్రం వద్ద 20,000 రూపాయల విలువైన మద్యంను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ముస్తాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వేములవాడ, మార్చి 21: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పొన్నం రవి అనే వ్యక్తి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో ఉన్న కొంత నగదు అపహరణకు గురయ్యాయని రవి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి చోరీ

సిరిసిల్ల క్రైం, మార్చి 21: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో పర్కాల శ్రీలక్ష్మి అనే వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం... పట్టణంలోని బీవైనగర్‌లో బుధవారం రాత్రి 10.30గంటలకు గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శ్రీలక్ష్మి అనే వృద్ధురాలిని నలుగురు వ్యక్తులు బెదిరించి తాళ్లతో కట్టేసి దోచుకున్నారు. ఆమె ఇంట్లో దాచిన ఆరువేల రూపాయలను, ఒక గ్రాము బంగారం, 12గ్రాముల వెండి నగలు ఎత్తుకొని వెళ్లారు. గురువారం ఉదయం పక్కింటివారు వచ్చి కట్లు విప్పేశారు. దీంతో బాధితురాలు శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి తెలిపారు. నలుగురు నిందితులు ఏ వైపు నుంచి వచ్చారని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంభీరావుపేట, మార్చి 21: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామం వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై రామ్మోహన్ గురువారం తెలిపారు. మండలంలోని మల్లుపల్లె వాగు నుంచి ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుక తరలిస్తుండగా లింగాపూర్ బస్ స్టేజి వద్ద పట్టుకున్నట్టు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

చందుర్తి, మార్చి 21: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి బస్టాండ్ వద్ద బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం..మండలంలోని ఎనగల్ గ్రామానికి చెందిన బత్తుల జయరాజ్ అనే వ్యక్తి రోడ్డుపై వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి


రాజమల్లయ్య(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 21: మండలంలోని ఆత్మనగర్ గ్రామానికి చెందిన చిలివేరి రాజమల్లయ్య అనే గీత కార్మికుడు ఆసపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువలు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 22న గ్రామంలోని తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడ్డాడు. ప్రమాదంలో రాజమల్లయ్యకు రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న చిలివేరి రాజమల్లయ్య గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో దొంగతనం


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ కరుణాకర్

వేములవాడ టౌన్, మార్చి 21: వేములవాడ మండలంలోని ఆరెపల్లి గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు సీతమ్మవారి పుస్తెమట్టెలు బుధవారం రాత్రి అపహరించుకుపోయారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి సీతమ్మవారి మెడలోని పుస్తెమట్టెలు అపహరించడంతో పాటు హుండీని పగలగొట్టి డబ్బులను దొంగలించినట్లు తెలిపారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 21 : మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన 14 మంది వ్యక్తులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష, రూ. 2,500లు జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మిగతా 13 మందికి 22 వేల రూపాయలు జరిమానావిధించినట్లు తెలిపారు.

వైభవంగా ధర్మపురి బ్రహ్మోత్సవాలు


ధర్మపురిలో కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకవస్తున్న కలెక్టర్


ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల కల్యాణోత్సవానికి ప్రభు త్వం పక్షాన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం క్షేత్రానికి చేరుకున్న కలె క్టర్, అధికారులకు ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా కలెక్టర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు నెత్తి మీద పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి చేతుల మీదుగా స్వామి వారలకు సమర్పించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చ కులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో కలెక్టర్‌కు స్వామి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పుస్తెలు, మట్టెలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జగిత్యాల ఆర్‌డీవో మధుసూధన్, డీఎఫ్‌వో వేంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పుప్పాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక దేవాలయం వద్ద ఆమె కొద్ది సేపు విలేకరుల సమావే శంలో మాటాడారు. వసతుల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా స్వామి వారల ఎదుర్కోలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఎదుర్కోలు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముందు ఆలయ అర్చకులు చిలుకముక్క అశ్విన్ ఇంటికి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ ఇంటికి శ్రీ వేంకటేశ్వర స్వామి వారలను తీసుకవచ్చారు. ప్రత్యేకంగా అలంకరణ చేసిన వేదికపై ఆశీనులు చేసిన ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎదుర్కోలు అనంతరం స్వామి వారల ఉత్సవ మూర్తులను ఆలయానికి తీసుక వెళ్లారు. ప్రధాన ఆలయం ఎదుట ధ్వజారోహణం నిర్వహించారు.

నిలిపిఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

ఫైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21: గోదావరిఖని మంథని రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంద కిరణ్ అనే యువకుడు మృతి చెందాడు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన కిరణ్ తన మిత్రుడు రాకేష్‌తో కలసి ద్విచక్రవాహనంపై మంథనివైపు వెళ్తుండగా 3 ఇంక్లయిన్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన బొగ్గు లారీని ఢీకొట్టాడు. తల భాగంలో బలమైన గాయాలు కావడంతో కిరణ్ అక్కడికక్కడే మరణించాడు. రాకేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతున్నాడు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట మండలంలో వేర్వేరు సంఘటనల్లో గురువారం ఇద్దరు వ్యక్తులపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు. విలాసాగర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా, పోలీస్‌లు పట్టుకుని కేసు నమోదు చేశారు. అదే విధంగా కోరపల్లి గ్రామానికి చెందిన వడ్నాల ఆశోక్ బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా, అతడి వద్ద రూ.5వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

అదనపు వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 21: అదనపు కట్నం కావాలని అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై బుధవారం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన తాళ్లపల్లి ప్రవళికతో తాళ్లపల్లి అజయ్‌కుమార్‌కు 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రవళిక తల్లిదండ్రులు వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. కొంత కాలంగా అదనపు వరకట్నం పది లక్షలు కావాలని అత్తింటి వారు వేదిస్తున్నారంటూ ప్రవళిక పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. భర్త అజయ్ కుమార్, అత్త యశోద, మామ శ్రీహరి, మరిది విజయకుమార్, ఆడబిడ్డ రేష్మ, బైరెడ్డి శివసాయిలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

● విద్యార్థి సంఘాల ఆందోళన


విద్యార్థి పునీత్ వీపుపై గాయాలు

కోల్‌సిటీటౌన్, మార్చి 21: గోదావరిఖని ఎల్‌బీనగర్‌లోని ఇండో అమెరికన్ స్కూల్‌లో 3వ తరగతి విద్యార్థి మేకల పునీత్‌ను టీచర్ చితకబాదింది. సైన్స్ సబ్జెక్టులో మార్కులు తక్కువ వచ్చాయని పునీత్‌ను బుధవారం టీచర్ కొట్టడంతో చేతులు, వీపు పైన వాతలు వచ్చాయి. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గురువారం పాఠశాలకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ నాయకుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. ఈ విషయమై వాట్సాప్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యం లో విచారణ చేపట్టారు. విద్యార్థి ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. సేకరించిన వివరాలతో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని సతీష్ తెలిపారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా 1089 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో డేటాను సకాలంలో ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు


పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

● సిరిసిల్ల డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో కార్యక్రమాల అమలు తీరు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాజన్నసిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రాథమిక అరోగ్య కేంద్రాల వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్ఎంలు, సిబ్బందికి హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫ్మరేషన్ సిస్టమ్, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన, డేటా శిక్షణను నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, రోగ నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ కేంద్రాల పనితీరు, ఇతర అంశాలపై ఉమ్మడి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహణ అధికారి సురేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. డేటా సేకరణతో పాటు సకాలంలో సక్రమంగా ఆన్‌లైన్ చేయాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమ, డీడీఎం కార్తీక్, ఏవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంవో బాలయ్య, డీఎస్‌వో పద్మయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, ఐసీటీసీ కౌన్సిలర్ గంగయ్య, దయాకర్, శ్రీనివాస్, శివ, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి రాజశేఖర్

గణేశ్‌నగర్,మార్చ్ 21: డిగ్రీ తర్వాత యువతకు విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ప్రతిభ, నిరంతర కృషి, సూక్ష్మ పరిశీలన, ఆధ్యయన శీలత, క్రమశిక్షణ, వార్తా పత్రికల విశ్లేషణ, బృంద చర్చలు, ప్రణాళిక, లక్ష్యంతో కూడిన లోతైన విషయ అవగాహనతో ఉద్యోగ సాధన సాఫల్యం అవుతుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య బి రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్‌సైన్స్‌కళాశాల (అంతర్గత నైపుణ్యాల సాధన విభాగం) ఆధ్వర్యంలో కెరీర్ ప్లానింగ్‌పై నిర్వహించిన కార్యశాలలో ఆచార్య రాజశేఖర్ మాట్లాడారు. చదువు కేవలం డిగ్రీల కోసం కాకుండా ప్రతిభ, విషయ సాధికారత, ప్రజ్ఞా సామర్థ్యాల పెంపుదల దిశగా జరగాలన్నారు. నచ్చిన అంశాలలో విస్తృత అవకాశాలు ఆధునిక యుగంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కేవలం సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్, ఐటీ రంగాలే కాకుండా జర్నలిజం, లలిత కళలు, వంటి ఎన్నో అవకాశాలు గ్లోబల్ స్థాయిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ఉన్న ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాల నైపుణ్యా వికాస కేంద్రంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, డా కే సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కే మల్లారెడ్డి, ఏ శ్రీనివాస్, ఎం అర్చన, వరప్రసాద్, శారద పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



బోర్నపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశావర్కర్లు ఇంటింటికి తిరుగుతూ కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించారు. లెప్రసీ నోడల్ పర్సన్ రమేష్, ఏఎన్ఎం వనిత, ఆశావర్కర్లు అరుణ, రమాదేవి, మున్సిపల్ వార్డు అధికారులు లత, పారిజాతం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి



మాట్లాడుతున్న వీసీ సంకశాల మల్లేష్

● ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి21: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి ఆరోహణ 2024 స్టూడెంట్ మీట్ లాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్‌యూ విసి ఆచార్య సంకశాల మల్లేష్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఏర్పాటు చేసిన శాతవాహన ఆరోహణ 2024 ఎంబీఏ, బీబీఏ విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో కొవిడ్ తర్వాత ఒక మంచి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యేవారికి, మార్కెట్‌కు సంబంధించిన వాటికి ప్రిపేర్ అయ్యేవారికి ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, ఇంటర్వ్యూ విధానంపై అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని వివరిం చారు. ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న వారిని గ్లోబల్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ రాజశేఖర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి హరికాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్, డాక్టర్ ఈ మనోహర్, ఎంబీఏ ఫ్యాకల్టీ డాక్టర్ మనోజ్ కుమార్ , డాక్టర్ టి.కృష్ణకుమార్, కామర్స్ ఫ్యాకల్టీ డాక్టర్ కే తిరుపతి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సావిత్రి, డాక్టర్ రవి పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లపై పోలీసుల దాడులు


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోనరావుపేట, మార్చి 21: మండలంలోని మల్కాపేటలో బెల్ట్‌షాపులపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కోనరావుపేట ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి గురువారం దాడులు నిర్వహించారు. మల్కాపేట గ్రామానికి చెందిన భోగి నాగరాజు, కుంట వెంకటి ఇంట్లో సోదాలు నిర్వహించగా సుమారు తొమ్మిది వేల రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు


తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు

ఎండపల్లి, మార్చి21; ఉపాధిహామీ కార్మికుల తవ్వకాలలో పురాతన విగ్రహాలు బయటపడ్డ సంఘటన మండలంలోని చెర్లపల్లి గ్రామంలో జరిగింది. కార్మికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ లాగే కార్మికులు గురువారం గ్రామంలోని ఎల్కల దేవి గుట్టకు కందకాలు తవ్వడానికి కూలీలు వెళ్లారు. పనిచేస్తుండగా 15 పురాతన విగ్రహాలు బయటపడగా గ్రామస్థులు అక్కడికి చేరుకొని పూజలు నిర్వహించారు. విషయం సంబంధిత అధికారులకు తెల్పడంతో వారు విగ్రహాలను పరిశీ లించారు. విగ్రహాలు ఎప్పటివో తెలియడం కోసం పురావస్తుశాఖ వారికి సమాచారం ఇవ్వనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

తిమ్మాపూర్‌లో యూనిసెఫ్ సెంట్రల్ టీం సందర్శన


తిమ్మాపూర్‌లో పరిశీలిస్తున్న యూనిసెఫ్ సెంట్రల్ టీం సభ్యులు

తిమ్మాపూర్, మార్చి21: తిమ్మాపూర్ మండల కేంద్రంలో యూనిసెఫ్ సెంట్రల్ టీం సభ్యులు సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద ఏర్పాటు చేసిన కంపోస్ట్ స్టాల్, శానిటరీ సిబ్బంది మెటీరియల్ స్టాల్, శానిటరీ పరికరాల స్టాల్‌లను పరిశీలించారు. అంగన్వాడీలలో రిట్రో ఫిటింగ్ టాయిలెట్‌లను, విట మిన్ గార్డెన్‌లను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని బృందం సభ్యులు పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచ నలు చేసి పనులపై సంతృప్తి వ్యక్తం చేసి అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఢిల్లీ యూనిసెఫ్ కార్యాలయం నుంచి కౌశిక్ బెనర్జీ, అరలికట్టి వెంకటేష్ , మురళీకృష్ణ, కొండవీటి ఫణీంద్ర, ఎంపిడివో విజయ్ కుమార్, ఎంపివో కిరణ్ కుమార్, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఆర్ఎం

భగత్‌నగర్, మార్చి 21: కరీంనగర్ బస్టాండ్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత బుధవారం తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని టాయిలెట్స్, లహరి ఏసీ బస్సులు, స్టాల్స్‌ను తనిఖీ చేశారు. డిప్యూటి రీజినల్ మేనేజర్స్ భూపతిరెడ్డి, సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డిపో మేనేజర్లు మల్లయ్య, మల్లేశం, కార్గో ఏటిఎం సదాశివ, బస్‌స్టేషన్ మేనేజర్ రజనీకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీజేపీలు ప్రజలను కష్టాల్లోకి నెడుతున్నాయి

నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి

కోరుట్ల, మార్చి 21 : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను కష్టాలకు నెడుతున్నాయని, ప్రజలకు అందుబాటులో సేవలు అందించింది బీఆర్ఎస్ పార్టీయేనని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, నిజామాబాదు ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్, జడ్పీ చైర్‌పర్సన్ వసంత ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోవర్దన్‌మాట్లాడారు. గ్యారెంటీ పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను టార్గెట్ చేసుకుని కాంగ్రెస్ నాయకులు రాక్షసంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతాంగానికి మేలు చేసిన వారిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మందువరసలో నిలుస్తారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల కుట్రతోనే ఎమ్మెల్సీ కవిత అరెస్టు అని ఆరోపించారు. నిజామా బాదు పార్లమెంట్ పరిధిలో ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకుని ఈ ప్రాంత అభివృద్ధికి దోహద పడాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలలోకి తీసుకపోయి బీఆర్ఎస్ పార్టీని పార్లమెంట్‌లో గెలిపించుకోవాలన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి భారీ మేజార్టీతో గెలిచే లక్ష్యంతో ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేసి బీజేపీ రాజకీయ లబ్దిపొందాలని చూస్తోందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి అప్పటి సీఎం కేసీఆర్ చేసిన సేవ గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య-రాజేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అనిల్, ఎంపీపీ తోట నారాయణలతో పాటు పార్టీ ప్రజా ప్రతినిదుల, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్దన్

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్ : రాష్ట్రంలో అధికారం అడ్డంపెట్టుకుని బెదిరింపులకు పాల్పడి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై తీవ్ర విమర్శలు చేస్తున్న వారికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీచైర్ పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో బీఆర్ఎస్ పట్టణ, మండలంలోని కార్యకర్తల సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యసాగర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజీరెడ్డి గోవర్ధన్‌తో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ గెలిచిన వంద రోజుల్లో రైతు బంధు, మహిళలకు రూ. 2500లు, కల్యాణలక్ష్మి పథకం ద్వారా తులం బంగారంతో ఎన్నికల ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. విద్యాసాగర్‌రావు, ఎంపీ అభ్యర్థి గోవర్ధన్ మాట్లాడుతూ నిజామాబాద్ ఎంపీగా ఐదేండ్లు కాలంలో ప్రజలకు చేసిన పనులు, నియోజక వర్గంలోని ఏ ఒక్క రోజు గ్రామాల్లో పర్యటించిన సందర్భాలు లేవన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా మెట్‌పల్లికి వచ్చి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. మరోమారు ఎన్నికల్లో మోసం చేయడానికి వస్తున్న ఎంపీ అర్వింద్, కాంగ్రెస్ పార్టీ మాటలను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు రాణావేని సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

కన్నుల పండుగగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

పెగడపల్లి, మార్చి 21 : మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం వెంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ మండపంలో అందంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలకు భక్తుల సమక్షంలో వేదమంత్రాల మధ్యన కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం పల్లకీలో ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయం చుట్టూ భక్తుల గోవిందనామ స్మరణల మధ్యన పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా గంద్ర వెంకట్‌రావు, ప్రవీణ్ రావు కుటుంబ సభ్యులు భక్తులందరికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, మాజీ గౌరవాధ్యక్షులు బోయినిపల్లి లక్ష్మణ్ రావు, కరుణా కర్ రావు, రాంచంద్రం, శేఖర్, గోపి, పార్థసారథి, పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా మందుకు సాగాలి

కొడిమ్యాల, మార్చి 21 : వలంటీర్లు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ప్రముఖ వైద్యుడు, సామాజికవేత్త ఎల్లాల శ్రీనివాసరెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవాపథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆరవ రోజు గురువారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్య, ఉపాధి విజయానికి సోపానాలన్నారు. నేడు యువత సామాజిక మాద్యమాల మత్తులో బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. అంతకు ముందు వలంటీర్లు శ్రమదాన కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వరస్వామి ఆలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అటవీ కార్యాలయం పరిసరాల్లోని చెత్తను, వ్యర్థపదార్థాలను తొలిగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఆర్. గోపికృష్ణ, కె. సతీష్‌కుమార్, మాజీ ఉప సర్పంచు గడ్డం జీవన్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బీడీ కంపెనీలపై మున్సిపల్ దాడులు



జరిమాన విధిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, మార్చి 21 : పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్న బీడి కంపెనీలపై గురువారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నిర్వహకులు జరిమాలను విధించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కంపెనీలలో బీడీ బట్టీలు పెడుతూ ప్రజా ఆరోగ్యాలను ప్రమాదంలోకి నెడుతున్న వారికి నోటీసులను జారీ చేశారు. పలు బీడి కంపెనీ యజమానులకు జరిమాలను విధించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఆకు అంజయ్య, రమేష్, రాజులతో పాటు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వాహనా తనిఖీలు రూ. 3లక్షల పట్టివేత

కోరుట్ల, మార్చి 21 : పట్టణంలోని నంది చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనీఖీ చేస్తుండగా రూ. 3లక్షలు పట్టుబడ్డట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని నంది చౌరస్తా వద్ద తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండా కోరుట్ల పట్టణానికి చెందిన వనమాల శుభశేఖర్ తన వాహనంలో రూ. 3 లక్షల నగదు తరలిస్తున్నట్లు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. శుభశేఖర్ పట్టణంలోని ఓ బీడీ కంపెనీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నగదు సంబంధించిన సరైన వివరాలు చూపక పోవడంతో నగదుతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సీజ్ చేసిన డబ్బులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలించి ఉన్నత అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

నేటి నుంచి గంభీర్‌పూర్‌లో లక్ష్మీనరసింహస్వామి జాతర



ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కథలాపూర్, మార్చి 21 : మండలంలోని గంభీర్‌పూర్‌లో ఈ నెల 23 నుంచి 25 దాకా శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరోత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 37వ వార్షికోత్సవాల్లో భాగంగా 23న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, తీర్థ ప్రసాద వినియోగం, 24న హారతి, మంత్రపుష్పం, 25న స్వామి వారి కళ్యాణం, అన్నదానం, స్వామివారి ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు ఆలయాన్ని జాతరకు ముస్తాబు చేశారు. కోరుట్ల నుంచి ప్రతీ గంటకు ఆర్టీసి బస్సు సదుపాయం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు జాతరకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అర్చకులు ఓరుగంటి మాధవాచార్యులు, గ్రామస్థులు కోరారు.

'అక్రమ కేసులకు ఎమ్మెల్యే వత్తాసు పలకొద్దు'

మెట్‌పల్లి, మార్చి, 21 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో బెదిరింపులకు పాల్పడే వారి గురించి తెలుసుకోకుండా వత్తాసు పలికి ఎమ్మెల్యే స్థాయిని తగ్గించుకోవద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి హితవు పలికారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత పక్షపాతి అయిన తనపై పెద్దాపూర్ గ్రామానికి చెందిన రంజిత్‌తో పాటు తండ్రిపై దాడి చేసిందని 75 ఏళ్ల వృద్ధురాలైన తన తల్లి, తనతో పాటు కుమారుడుపై అక్రమంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం సరికాదన్నారు. ఇలాంటి వారికి స్థానిక ఎమ్మెల్యే మద్ధతు పలికి వారి స్థాయిని తగ్గించుకోవద్దని, అన్ని విషయాలను ప్రజలు గమనిస్తున్నారని, దళిత నాయకులు ఇలాంటి బెదిరింపులకు పాల్పడే వారికి వొత్తస్తు పలకొద్దని కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ శంకరయ్య, సురేష్, విలాస్‌గౌడ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కిరాణ షాపు యజమాని

ధర్మపురి, మార్చి 21: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన ఇటిక్యాల స్వాతి కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చారు. కల్యాణ అనంతరం తిరుగు ప్రయాణంలో కారులో వెళ్తుండగా హరిత హోటల్ దగ్గర బ్యాగు కిందపడిపోయింది. గమనించిన కిరాణ షాపు యజమాని అక్కెపల్లి అరవింద్ బ్యాగును గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి బ్యాగును చెక్ చేయగా అందులో 3తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, సుమారు 2 లక్షలు నిలువ ఉన్నాయి. బ్యాగులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా వారికి సమాచారం ఇచ్చి అందించారు. ఈ సందర్భంగా అరవింద్‌ను సీఐ రామ్ నర్సింహరెడ్డి, ఎస్సై ఉదయ్ కుమాం అభినందించారు.

అడవుల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

రాయికల్, మార్చి 21: అడవులను పెంచడం వలన పర్యావరణాన్ని కాపాడిన వాళ్లమవుతామని జగిత్యాల రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని అడవిలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గ్రామంలోని రైతులకు, శ్రీవాణి ఈ టెక్నో స్కేల్ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల పరిరక్షణ వలన స్వచ్ఛమైన గాలి అందించవచ్చని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నారు. వర్షాలు కురవడం వల్ల కెమికల్స్ వాడకుండానే పంటలు సమృద్ధిగా పండుతాయని అన్నారు. అడవిలోని చెట్లను నరికితే అటవీ శాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అడవులు సమృద్ధిగా ఉంటే కోతులు ఊరిలోకి రావని, కోతుల బెడద నుంచి జనానికి, రైతులక వారి పంట పొలాలకు ఇబ్బంది ఉండదని అన్నారు. అనంతరం అడవుల వలన కలిగే లాభాల గురించి మాట్లాడిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వోలు రవి కుమార్, అరుణ్ కుమార్, ఎఫ్ఎస్‌వో హమీద్, ఎఫ్‌బీవో నరేష్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల : ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొడిమ్యాల కేంజ్ అటవీ శాఖ అధికారులు, కార్యాలయ పరిసరాల్లోని చెత్త చెదారాన్ని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తొలిగించారు. పరిసరాల పరిశుభ్రత వలన కలుగు ప్రయోజనాలను ప్రజలకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల రేంజర్ బి. లత, డిప్యూటీ రేంజర్లు ముషీర్ అహ్మద్ సిద్దిఖ్, మౌనిక, ఎస్‌హెచ్‌వో రత్నమ్మ, బీట్ అధికారులు మదుసూధన్, సాయి రాం, ఆనందరావు, ప్రవీణ్, ప్రదీప్, అశ్విని, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని అటవీ ప్రాంతంలో గురువారం తుంగూర్ సెక్షన్ అధికారి గంగారాం ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మంగేళ, తుంగూర్, కొల్వాయి బీట్ పరిధిలో గల అటవీ ప్రాంతాలతో అరగుండాల చెరువు ప్రాంతంలోని మొక్కలకు శానిటేషన్ నిర్వహణ చేసీ అటవీ సంరక్షణపై గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మంగేళ సెక్షన్ అధికారి ప్రకాష్, బీట్ ఆఫీసర్‌లు రాజేశం, రాజశేఖర్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే చర్యలు

అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు

మెట్‌పల్లి, మార్చి, 21 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోబడునని అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు హెచ్చరించారు. ఎన్నికల నియమ నిబంధనలను పటిష్ఠంగా నిర్వహించడానికి వచ్చిన సెంట్రల్ ఫోర్స్, పారా మిలటరీ బలగాలు, స్థానిక పోలీసు సిబ్బందితో గురువారం పట్టణంలో నిర్వహించిన కవాత్‌కు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేలా భరోసా కల్పించడం కోసమే పోలీసు బలగాలతో కవాత్ (ఫ్లాగ్ మార్చ్)ను నిర్వహించామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలుగకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టుతున్నమన్నారు. ఇందులో భాగంగానే సెంట్రల్ పోలీస్ ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది కలిసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా భద్రత చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నవీన్‌కుమార్, కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఆర్ఐ రామక్రిష్ణ, సీఎస్ఎఫ్ సీఐ సచిన్ వర్మ, ఎస్సై చిరంజీవి, సెంట్రల్ ఫోర్స్, పారా మిలటరీ బలగాలు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి కవాతు ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలి



చైర్ పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

జగిత్యాల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ 6, 9, 25వ వార్డులకు చెందిన పలువురు మహిళలు, నాయకులు గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. వార్డు సమస్యలను చైర్ పర్సన్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేలా తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు ఉన్నారు. అనంతరం చైర్ పర్సన్ జిల్లా కేంద్రంలోని పలు వాటర్ ట్యాంకులను పరిశీలించారు. నీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సాయి బాబా ఆలయంలో పూజలు

జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌లో ఉన్న సాయి బాబా ఆలయంలో గురు వారం మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహిం చా రు. జ్యోతిని ఆలయ కమిటీ సభ్యులు షాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సతీష్ కుమార్, సభ్యులు నాగుల కిషన్‌గౌడ్, మార కైలాసం, రాంకి షన్ రావు, కళాశ్రీ గుండేటి రాజు ఉన్నారు.

పోచమ్మ బోనాలు సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం

జగిత్యాలరూరల్, మార్చి 21 : పోచమ్మబోనాలు తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్-వంజరిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పోచమ్మ బోనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే, జడ్పీచైర్‌పర్సన్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

పోచమ్మ ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే నృత్యం చేసి అలరించారు. ఈకార్యక్ర మంలో బీఆర్ఎస్‌పార్టీనాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్, మార్చి 21: క్రీడల్లో గెలుపోటములు సహజమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రా మంలో అల్లీపూర్ ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విన్నర్ ముఖీద్ ఛాలెంజర్స్, రన్నర్ మ్యాలపు మురళి కింగ్స్ టీమ్‌లకు బహు మతులు ప్రదానం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని, గత తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో క్రీడలకు పెద్దపీట వేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించిందన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, ఎంపీటీసీ మోర విజయ లక్ష్మివెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు ముఖీద్, ఉప సర్పంచ్ సాగర్ రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు రత్నాకర్ రావు, యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు గోపి, ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

బీసీల అభివృద్ధికి కృషి చేసే వారికి ఎన్నికల్లో మద్దతు

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్

మెట్‌పల్లి, మార్చి, 21 : రాష్ట్రంలోని అన్ని పార్టీలు బీసీలను ఎన్నికల సమయంలో వాడుకుని ఆ తరువాత వదిలేస్తున్నారని, కానీ బీసీల అభివృద్ధికి కృషి చేసే వారికి జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ 37 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం 27 శాతానికి చేసిందని, దీనిని 50 శాతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీ కుల గణన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చేపట్టాలని, బీసీలకు క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకులాలకు స్వంత భవనాలు ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు త్వరగా విడుదల చేయాలని, హాస్టల్లో మెస్ చార్జీలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మల శంకర్, శ్రీకాంత్, మాచర్ల సదానందం, అజయ్, బింగి వెంకటేష్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, భీమేశ్వర్, సురేష్, ఆనంద్, వరదరాజు, నరసింహారావు, పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్

పెగడపల్లి వాసికి శివాజీ మహరాజ్ ఉత్తమ సేవా పురస్కార్

పెగడపల్లి, మార్చి 21 : పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు డాక్టర్ బత్తుల ప్రదీప్ ఛత్రపతి శివాజీ మహరాజ్ ఉత్తమ సేవా పురస్కార్ 2024 జాతీయ అవార్డును అందుకున్నారు. వివిధ రంగాలలో సేవలు అందించిన పలువురికి మోక్ష గ్లోబల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక అతిథి మిస్ ఆసియా ఇంటర్నేషనల్ మిస్ ధ ప్లానెట్ రష్మీ ఠాకూర్, దాసరి పార్వతి సరిగమప సింగర్ జీ తెలుగు కల్పన పొన్నం గార్ల చేతుల మీదుగా ప్రదీప్ ఈ పురస్కార్ అవార్డును అందు కున్నారు. ప్రదీప్ జాతీయ పురస్కారాన్ని అందుకోవడం పట్ల మండల ప్రజాప్రతినధులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, మార్చి 21 : మండల కేంద్రంలో నిర్మించిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన ఎల్లం లక్ష్మీరాజంలత దంపతులు 1,10116 రూపాయలను, బద్దం జనార్దన్‌రెడ్డిదేవేంద్ర దంపతులు రూ.25,116లను ఆలయ పూజారి నాగరాజు రమేష్, ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

రాయికల్, మార్చి 21: రాయికల్ పట్టణంలోని సడే బీమ్ మైదానంలో గురువారం 24/7 క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్ విలేజ్ టు విలేజ్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సుంకె వంశీ, రాంకీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటిపెల్లి రాంరెడ్డి, తురగ శ్రీధర్ రెడ్డి, మ్యాకల రమేష్, మ్యాకల కాంతారావు, ఎలిగేటి అనిల్, మోర రామ్మూర్తి, షరె శ్రీదర్, బత్తిని నాగరాజు, పెండెల గణేష్, భూక్య రాకేష్ నాయక్, నరంశెట్టి మనోజ్, అమీర్ అలీ, మ్యాకల భాను, క్రీడాకారులు పాల్గొన్నారు.

11 కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోళ్లు

కథలాపూర్, మార్చి 21 : రబీ సీజన్‌కు సంబంధించి సెర్ప్ ఆధ్వర్యంలో మండలంలో 11 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఏపీఎం నరహరి తెలిపారు. అంబారిపేట, బొమ్మెన, భూషణరావుపేట, చింతకుంట, దూలూరు, కథలాపూర్, పెగ్గెర్ల, పోతారం, సిరికొండ, తక్కళ్లపల్లి, తాండ్ర్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నామన్నారు. రైతాంగం తమ ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు మాత్రమే తెచ్చి విక్రయించుకోవాలని మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. సిబ్బందికి ప్రభుత్వం కొనుగోళ్లపై శిక్షణా కార్యక్రమాలు కొనసాగించనుందని తెలిపారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

మల్యాల, మార్చి 21: మండలంలోని ముత్యంపేట పోచమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి అవి పని చేస్తుండగా వాటి ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన ఎంపీ బండి సంజయ్‌కు బీజేపీ నాయకులు సామ మహిపాల్‌రెడ్డి, గుర్రం శ్రీదర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

కథలాపూర్, మార్చి 21 : మండలంలోని అంబారిపేట మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్ సతీమణి రాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని గురువారం వేములవాడ బీఆర్ఎస్ నాయకులు చెలిమెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి, మాజీ ఏఎంసీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్‌రావు, చీటి విద్యాసాగర్ రావు, ఎంపీటీసీ వేముల గంగరాజం ఉన్నారు.

పంటల బీమాను అమలు చేయాలి

కొడిమ్యాల, మార్చి 21 : అతివృష్టి, అనావృష్టిలతో రైతుల పంటలు నష్టపోయినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమాను స్వయంగా అమలు చేసి నష్టపరిహారం అందించాలని పూడూర్ మాజీ సర్పంచు వెల్మల రాంరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రైతులకు అతి వృష్టి, అనావృష్టి, ఈదురుగాలులు, వడగళ్లు, వరదలు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభ వించినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక సర్వేలు చేయించడం, నష్టపరిహారం చెల్లించె విషయంలో వెనుక ముందు కావటం సరికాదని ప్రకటనలో పెర్కొన్నారు. అన్ని పంటలకు బీమాను వర్తింపచేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం అందజేస్తె రైతులు పంటలను దైర్యంగా వేసుకుంటారని ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

మల్యాల, మార్చి 21: మల్యాలలోని రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం చేశారు. అనంతరం శోభాయాత్ర, కుంకుమ పూజలు, పట్నం, బోనాలు నిర్వహించారు. గౌడ సంఘం ప్రతినిధులు యాగండ్ల సుమన్‌గౌడ్, కాలికంటి స్వామి గౌడ్, మంద తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు..